సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం ౹ 26 ౹ డిసెంబర్ ౹ 2024



శేష వాహనంపై సప్త గిరీశుడు

నక్కపల్లి (అనకాపల్లి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో బుధవారం ఇత్తడి శేషవాహనం పై వేంకటేశ్వర స్వామి తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామి వారి మూల విరాట్‌కు నిత్య పూజలు, అభిషేకలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన ఉత్సవ మూర్తులకు గోదాదేవి అమ్మవారి సన్నిధిలో నిత్యార్చనలు నిర్వహించారు. ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని శేష వాహనం పైన, పల్లకీ పై గోదాదేవి అమ్మవారిని ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

పాడేరు కాఫీ హౌస్‌లో మెగా రక్తదాన శిబిరం రేపు

పాడేరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 27న పాడేరు కాఫీ హౌస్‌లో మెగా రక్తదాన శిభిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి జి. గౌరీశంకర్ తెలిపారు. ఆస్పత్రుల్లో రక్త నిల్వలు సకాలంలో అందుబాటులో లేని కారణంగా అత్యవసరంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, యువతీ, యువకులు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు, గ్రామ సచివాలయ, రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డైట్ కళాశాల సందర్శన



డైట్ విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: విద్యార్థినుల పట్ల పీడీ అసభ్యకరంగా ప్రవర్తించిన నేపథ్యంలో స్థానిక డీఎడ్ కళాశాలను మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సందర్శించారు. విద్యార్థినుల నుంచి సమస్య తెలుసుకున్న ఆమె రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంతో ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటికే పీడీని సస్పెండ్ చేశామని, సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని పీవో చెప్పినట్టు ఆమె తెలిపారు. అధైర్యపడవద్దని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, కారుకోడి పూజ, జల్లేపల్లి రామన్నదొర, చితుకులయ్యరెడ్డి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినాయుడుకు నివాళి

- పాడేరులో ఆయన వర్ధంతి నిర్వహణ



చిట్టినాయుడు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: దివంగత మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి చిట్టినాయుడు వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని నిలువెత్తు విగ్రహనికి ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆమె భర్త డాక్టర్ నర్సింగరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు చీరలు, రగ్గులను వారు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా కేసీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఖోఖో జట్ల ఎంపిక



ఏయూ పురుషుల జట్టుతో రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు డైరక్టర్ తదితరులు



మహిళా జట్టుకు సూచనలు ఇస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఏయూ తరుపున ఆడే ఖోఖో పురుషుల, మహిళల జట్లను బుధవారం ఎంపిక చేశారు. వీరిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అభినందించారు. ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ సాధించి ఏయూకు మంచి పేరుతీసుకురావాలని ఆకాక్షించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ పురుషులు ఖోఖో పోటీలు తిరువూరు తమిళనాడు యూనివర్సిటీలో ఈనెల 27 నుంచి 31 వరకు జరుగుతాయన్నారు. జట్టు కోచ్‌గా చింతపల్లి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పీడీ శివకుమార్ వ్యవహరిస్తారన్నారు. ఇంటర్ యూనివర్సిటీ మహిళల ఖోఖో పోటీలు కాలికట్ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి 31 వరకు జరుగుతాయన్నారు. సెయింట్ యాన్స్ కాలేజ్ పీడీ సంధ్యారాణి జట్టు కోచ్‌గా ఉంటారన్నారు.



హుకుంపేట మండలం చింతలవీధిలో తడిచిపోయిన వరి పనలు



కామయ్యపేటలో పాడైన ఉలవ,రాజ్‌మా పంటను చూపిస్తున్న రైతు

వదలని వాన.. ప్రకృతి ప్రకోపం

రైతన్న హైరానా

ప్రకృతి కన్నెర్రతో గిరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కోతకు సిద్ధంగా ఉన్న వరికి, దిగుబడి దశకు చేరుకుంటున్న రాజ్‌మా, పప్పుధాన్యాల పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. దీంతో పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంటుండటంతో వారి ఆర్థిక పరిస్థితి తలకిందులవుతోంది.

- అకాల వర్షాలతో రైతుల పరిస్థితి తలకిందులు
- వరి, రాజ్‌మా, పప్పుధాన్యాల పంటలకు తీవ్ర నష్టం
- రాజవొమ్మంగి ప్రాంతంలో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న వరి రైతులు
- ధాన్యం ధర తగ్గించినా వెంటనే నగదు చెల్లించడంతో ఊరట



నక్కలపుట్టు ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న రాజ్‌మా పైరు

సాక్షి,పాడేరు: ఖరీఫ్‌లో సాగు చేపట్టిన పంటలన్నీ దిగుబడి దశలో ఉన్న పరిస్థితుల్లో అకాల వర్షాలు గిరిజన రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలు పంటలకు నష్టం కలిగిస్తున్నాయని వారు వాపోతున్నారు. జిల్లాలో సాగువిస్తీర్ణంలో 40శాతం భూముల్లో వరి కోతలు,నూర్పులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పనలు తడిచిపోయి రాలిపోతున్నాయి. పాడేరు డివిజన్‌లో 15వేల ఎకరాల్లో సాగు చేపట్టిన రాజ్‌మా రైతు పరిస్థితి దయనీయంగా ఉంది. మూడు వారాల క్రితం కురిసిన వర్షాలకు సాగు విస్తీర్ణంలో 20 శాతం పంటకు నష్టం వాటిల్లింది. మిగతా పంటను సేకరిద్దామన్న సమయంలో రాజ్‌మా గింజలు తడిచిపోయి మొలకెత్తుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అనంతగిరి, అరకులోయ, హుకుంపేట, పాడేరు మండలాల్లో పప్పు ధాన్యాల పంటలకు నష్టం కలిగించాయి.

వర్షపాతం ఇలా.. : జిల్లాలో మూడు రోజులు వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అనంతగిరిలో 35.2, పాడేరులో 26.8, జి.మాడుగులలో 25.6, హుకుంపేటలో 19.8, చింతపల్లిలో 16.4, పెదబయలులో 12.6, జీకేవీధిలో 11.4, డుంబ్రిగుడలో 6.4, అరకులోయలో 5.6, మారేడుమిల్లిలో 4.8, ఎటపాకలో 3.8, కొయ్యూరులో 3.2, ముంచంగిపుట్టులో 2.6, వై.రామవరంలో 2.2, అడ్డతీగలలో 2.2, కూనవరంలో 2.2, వీఆర్‌పురంలో 2.2, చింతూరులో1.8, రాజవొమ్మంగిలో 1.2, గంగవరంలో 0.8, రంపచోడవరంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం బుధవారం నమోదైందని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

ప్రైవేట్ వ్యాపారులే దిక్కు



వరి పనలను సేకరిస్తున్న కూలీలు



ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపుతున్న రైతులు

రాజవొమ్మంగి: అకాల వర్షాలు మండలంలోని రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటివరకు 6వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని అమ్ముకుందామన్న పరిస్థితుల్లో వాతావరణంలో మార్పులు అవస్థలకు గురి చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు రాత్రిపగలు కాపాలా కాస్తున్నారు. మరో వైపు తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉంటే కొనేదిలేదని ధాన్యం కొనుగోలు కేంద్రాల అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నిబంధనలు కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వారికి విక్రయిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 75 కిలోల బస్తాకు రూ.1725 ధర నిర్ణయించింది. అయితే పూర్తిగా ఆరిన తరువాత తీసుకురమ్మంటున్నారు. ఇందుకు వాతావరణ పరిస్థితులు సహకరించకపోవడంతో రైతుల ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. యంత్రాలతో కోసిన వెంటనే పొలాల వద్ద 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1300 చెల్లిస్తున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని రూ.1600కు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ధర తగ్గించినా వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారని రైతులు పేర్కొన్నారు.

ఈ నెలాఖరు వరకు బీమాకు గడువు



దెబ్బతిన్న రాజ్‌మా పంటతో రైతులు

గూడెంకొత్తవీధి: మండలంలో దిగుబడి దశలో ఉన్న రాజ్‌మా, రాగులు, వరి పంటలకు ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. సుమారు 1450 ఎకరాల్లో సాగవుతున్న రాజ్‌మా పంట దెబ్బతింటోంది. కొన్నిచోట్ల పైరు గింజకట్టే దశలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గింజ రంగు మారిపోతోందని రైతులు వాపోతున్నారు.ఈ నెల 31 వరకూ బీమా చెల్లించుకునే అవకాశం ఉన్నందున రైతులు దీనిని సద్వినియోగం చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడులు తగ్గినా నష్టపోయినా తగిన పరిహారం పొందే అవకాశాలున్నాయని ఏవో మధుసూదనరావు తెలిపారు మధుసూదనరావు తెలిపారు.

పంట నష్టాలపై సమగ్ర సర్వే చేపట్టాలి

అకాల వర్షాలకు వరితో పాటు రాజ్‌మా,ఇతర వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లింది.రాజ్‌మా పంట అయితే పూర్తిగా పాడైంది.పంటల గింజలన్నీ మొలకెత్తడంతో పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి. పంట నష్టం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేసి ఆదుకోవాలి. – పాంగి బేసు, సర్పంచ్, తీగలవలస, హుకుంపేట

విద్యుత్ చార్జీల పెంపుపై రేపు పోరుబాట

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- విజయవంతం చేయాలని పిలుపు



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 27 వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ చేపట్టే పోరుబాట కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరపున నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. దీనిలో భాగంగా ర్యాలీగా పాడేరులో విద్యుత్ కార్యాలయానికి వెళ్లి పెంచిన చార్జీలను తగ్గించాలని వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, సర్పంచ్ కిముడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం నేతల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

రంపచోడవరం : ఊట్ల క్వారీలో ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మృతికి కారణమైన క్వారీ నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పిన్న కిరణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లోత రామారావు, ప్రాంతీయ కన్వీనర్ మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్వారీని నిలిపివేయాలని వారు కోరారు. రంపచోడవరం ప్రాంతంలో విచ్చలవిడిగా మైనింగ్ క్వారీలు నడుస్తుంటే మైనింగ్ అధికారులు ఏంచేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. అనుమతులు లేకుండా నడుస్తున్న క్వారీలపై వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆయా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఊట్ల క్వారీలో ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

డోలీలో అనారోగ్యానికి గురైన గిరిజనుడు తరలింపు

సుమారు నాలుగు కిలోమీటర్ల మేర మోసుకువెళ్లిన గిరిజనులు



గిరిజనుడిని డోలీలో మోసుకుని గెడ్డలోంచి ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనులు

పాడేరు : రహదారి, రవాణా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో మారుమూల గ్రామాల గిరిజనులు నరకం చూస్తున్నారు. అనారోగ్యానికి గురైన గిరిజనుడిని ఆస్పత్రికి తరలించేందుకు అష్టకష్టాలు పడ్డారు. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ మారుమూల డి. సంపల గ్రామానికి చెందిన గిరిజనుడు వంతాల మిట్టన్న(50) తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అతని ఆరోగ్య పరిస్థితి బుధవారం విషమంగా మారింది. ఆస్పత్రికి తీసుకువెళ్లందుకు రోడ్డు, రవాణా సౌకర్యం లేదు. దీంతో చేసేది లేక డోలి కట్టారు. జోరుగా కురుస్తున్న వర్షంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలు ఎక్కి కాలువలు దాటుకుంటూ దొడ్డిపల్లి గ్రామం వరకు మోసుకొని వచ్చారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ వాహనంలో స్థానిక జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. తమ గ్రామానికి రోడ్డు, రవాణా సౌకర్యం లేదని, ఎవరైనా అనారోగ్యానికి గురైనప్పుడు ఆస్పత్రికి తరలించేందుకు డోలీలో తీసుకుని వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రోడ్డు, రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

27న వాలీబాల్ సీనియర్ విభాగం రాష్ట్ర జట్ల ఎంపిక

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్‌మోహన్‌రావు

పాడేరు రూరల్: విజయవాడలో ఈనెల 27న వాలీబాల్ సీనియర్ విభాగం పురుషులు, మహిళల రాష్ట్ర జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్‌మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే ఈ ఎంపికకు హాజరు కావాలని ఆయన కోరారు. తప్పనిసరిగా ఆధార్, నివాస ధ్రువీకరణపత్రం ఒరిజనల్‌తోపాటు జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని ఆయన సూచించారు. ఎంపికైన పురుషులు, మహిళా జట్లు వచ్చే నెల 7 నుంచి 13 వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9394494645లో సంప్రదించాలని ఆయన కోరారు.

బైక్ రేస్ ఫస్ట్ లుక్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు (విశాఖ): ఫిలిం నెస్ట్ మూవీస్, రాజేశ్వరి సినీ క్రియేషన్స్, ఇన్ అసోసియేట్ శ్రీ గణేష్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా నిర్మిస్తున్న బైక్ రేస్ సినిమా ఫస్ట్ లుక్‌ను నిర్మాత లంక కృష్ణ పుట్టినరోజు సందర్భంగా బుధవారం విడుదల చేశారు. ఈ మేరకు పెదవాల్తేరులో జరిగిన మీడియా సమావేశంలో దర్శకుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ గతంలో తస్మాత్ జాగ్రత్త, ఎంత పని చేశావ్ చంటి సినిమాలను రూపొందించామన్నారు. వైజాగ్‌లో చిత్రీకరించిన బైక్ రేస్ చిత్రం ఓ వినూత్న కథతో 2025లో ప్రేక్షకుల ముందుకు వస్తుందన్నారు. హీరో వినయ్ ఆదిత్య, హీరోయిన్ దేవి, సీనియర్ నటులు సుధ, కాశీవిశ్వనాథ్, శ్రీలక్ష్మి ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్లు తెలిపారు. నిర్మాత లంక కృష్ణ మాట్లాడుతూ ఈ సినిమా నేటి యువతతో పాటు, ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో పైడిరాజు నూనెల, సిరసపల్లి నూకరాజు, సిరసపల్లి వెంకటరమణ, ఎంత పని చేశావు చంటి హీరో శ్రీనివాస్, సినిమాటోగ్రాఫర్ డేగల శ్రీహరి, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పాడేరులోని ఏసు ప్రభువు మందిరంలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ కుటుంబాలు

సాక్షి,పాడేరు: క్రిస్మస్ పండగను బుధవారం జిల్లాలో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు.జిల్లా కేంద్రమైన పాడేరులోని ఏసుప్రభువు ప్రార్థన మందిరం, పురాతన సీబీఎం చర్చి, డిగ్రీ కళాశాల రోడ్డు, పాతపాడేరు, పి.గొందూరు, గుడివాడ మెట్ట కాలనీ, గుడివాడ, లోచలిపుట్టు, గుడివాడ నీళ్ల ట్యాంక్ , సుండ్రుపుట్టు, తలారిసింగి, చింతలవీధి, మినుములూరు ప్రాంతాల్లోని చర్చిల్లో వేకువజామునుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. విందు భోజనాలు నిర్వహించారు.

క్రైస్తవులకు శుభాకాంక్షలు

జిల్లాలోని క్రైస్తవులకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, పాడేరు, రంపచోడవరం,చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సింహాచలం, చైతన్య, అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీలు డాక్టర్ కుంభా రవిబాబు, అనంతబాబు, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు,రేగం మత్స్యలింగం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలి

విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



చింతూరులో డీఐజీ గోపీనాథ్ జెట్టికి స్వాగతం పలుకుతున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు: నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న చింతూరు సబ్ డివిజన్‌లో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సబ్ డివిజన్ పోలీసులకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక ప్రణాళికలతో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. దండకారణ్యం, ఏవోబీ సరిహద్దులో ఉన్నందున మావోయిస్టు కార్యకలాపాలపై నిత్యం నిఘా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. సరిహద్దు రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో అదనపు బలగాలతో నిరంతరం కూంబింగ్ చేపట్టాలని ఆయన సూచించారు. గంజాయి అక్రమ రవాణా, మావోయిస్టుల కార్యకలాపాలపై సమాచారాన్ని మెరుగు పరుచుకోవాలని ఆయన ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి గిరిజనుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం(విశాఖ): పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం (08522/08521) పాసింజర్ స్పెషల్‌కు జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కేఎస్ఆర్ బెంగళూర్-భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 2వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్.
- భువనేశ్వర్-తిరుపతి (22879) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 4 నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో తిరుపతి-భువనేశ్వర్(22880) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 5 నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్.
- సంబల్‌పూర్-నాందేడ్ (20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో నాందేడ్-సంబల్‌పూర్(20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జనవరి 4 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- సంబల్‌పూర్-ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలోఈరోడ్- సంబల్‌పూర్(08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- భువనేశ్వర్-జునాగడ్(20837) ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో జునాగడ్-బువనేశ్వర్(20838) ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 2 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్.
- పూరీ-యశ్వంత్‌పూర్922883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 4 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.

నేటి నుంచి రైస్, కిరాణా

దుకాణాల బంద్

అనకాపల్లి: పట్టణ పరిధిలో రైస్,కిరాణా, ఆయిల్ దుకాణాల యజమానులు గురువారం నుంచి షాపులు మూసివేసి బంద్ పాటించనున్నట్లు అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేడ శంకరరావు తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం రైస్, కిరాణా, ఆయిల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా వర్కర్ల కూలీ రేట్ల పెంపుపై మూడు దఫాలు చర్చలు జరిపినప్పటికీ అంగీకారం కుదరలేదని చెప్పారు. ప్రస్తుత కూలిరేట్లకు అదనంగా 50శాతం పెంచితేనే పనిచేస్తామని, లేకపోతే ఈ నెల 26 నుంచి సమ్మెచేస్తామని వర్కర్లు నోటీస్ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం వ్యాపారులు 50 కిలోల బస్తాకు రూ.9.64, 26 కిలోల బస్తాకు రూ.8.06 , ఆయిల్ డబ్బాకు రూ.5.18 చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఇతర ప్రాంతాల వ్యాపారుల కంటే అధికంగా చెల్లిస్తున్నట్టు ఆయన తెలిపారు. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ రావడంతో వ్యాపారాలు సరిగా లేవని, 50శాతం పెంచినట్టయితే వ్యాపారులపై మరింత భారం పడుతుందన్నారు. అందువల్ల వర్కర్ల తీరుకు నిరసనగా బంద్ పాటించనున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

పర్వతారోహణ చేస్తూ అందనంత దూరానికి...

- విహారయాత్రలో విషాదం
- కొంకణ్‌లో కూర్మన్నపాలెం వాసి మృతి
- మృతుడు బెంగళూరులో చార్టర్డ్ అకౌంటెంట్


మృతుడు కాండ్రేగుల అనిల్‌కుమార్

అగనంపూడి: విహారయాత్రకు వెళ్లిన కూర్మన్నపాలేనికి చెందిన యువకుడు మృత్యువాతపడ్డాడు. అతని బంధువులు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం సమీపంలోని శాతవాహనగర్–1కి చెందిన కాండ్రేగుల అనిల్‌కుమార్(31) బెంగళూరులోని ఒక ప్రైవేట్ కంపెనీలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. తోటి మిత్రులతో కలిసి అనిల్ గోవా, కొంకణ్ విహారయాత్రకు వెళ్లాడు. సోమవారం కొంకణ్‌లో పర్వతారోహణ చేస్తుండగా ఛాతీలో నొప్పితో బాధపడుతూ ఊపిరి ఆడక కుప్పకూలిపోయాడు. మిత్రులు, స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం శాతవాహనగర్‌కు తీసుకొచ్చారు. కూర్మన్నపాలెంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అందివచ్చిన కొడుకు అకాల మరణంతో అతని తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

సీతమ్మధార: శ్రీకాకుళం జిల్లా కంచిలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సీతమ్మధార వాసుల అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. సీతమ్మధార దరి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సుబ్బనారాయణ హైట్స్‌లో నివాసం ఉంటున్న ముత్తా వెంకట రంగ రాజేష్ కుటుంబం ఒడిశాలోని జాజ్‌పూర్ వెళ్తూ.. రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆయన భార్య లావణ్య, కుమార్తె నేహా గుప్తా, తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు దుర్మరణం పాలయ్యారు. రాజేష్‌తో పాటు తల్లి స్వల్పగాయాలతో బయటపడ్డారు. సోమేశ్వరరావు భార్య రాధిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా.. నగరంలోని నక్కవానిపాలెం శ్మశానవాటికలో లావణ్య, నేహా గుప్తా అంత్యక్రియలను బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. సోమేశ్వరరావు మృతదేహాన్ని భద్రాచలం తరలించారు.

టైం లేదు.. ట్రైన్ లేట్..

- ఆలస్యంగా రైళ్ల రాకపోకలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



తాటిచెట్లపాలెం: రైలు ప్రయాణం.. ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. నత్త తన గమ్యాన్ని నిర్దేశిత సమయంలో.. తనకున్న వేగంతో చేరుకుంటుంది. కానీ రైలు ప్రయాణం మాత్రం అగమ్యగోచరంగా మారింది. ఏ రైలు ఎప్పుడు గమ్యస్థానానికి చేరుకుంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ మధ్య కాలంలో రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. గతంలో పాసింజర్ రైళ్లు ఎక్కడ పడితే అక్కడ ఆపేయడంతో గంటల తరబడి, ఒక్కోసారి రోజుల తరబడి ఆలస్యంగా నడిచేవి. మోదీ ప్రభుత్వం వచ్చాక పాసింజర్ రైళ్లు దాదాపుగా కనుమరుగయ్యాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ రైళ్లు వేగంగా గమ్యస్థానానికి చేరుస్తాయని ఆశించిన ప్రయాణికులకు నిరాశ ఎదురవుతోంది. ఇటీవల హైదరాబాద్ నుంచి బయలుదేరిన గోదావరి సూపర్‌ఫాస్ట్ దువ్వాడ వరకు నిర్ణీత సమయానికి చేరుకుంది. కానీ దువ్వాడ నుంచి విశాఖపట్నం(17 కిలోమీటర్ల దూరం) చేరుకోవడానికి రెండున్నర గంటల సమయం పట్టింది. ఇలాగే చాలా రైళ్లు అనకాపల్లి, దువ్వాడ నుంచి విశాఖపట్నం స్టేషన్‌కు చేరుకునేందుకు గంటల కొద్దీ సమయం పడుతోంది. ఎంత సూపర్‌ఫాస్ట్ రైలు అయినా ఈ తిప్పలు తప్పడం లేదు. అటునుంచి వచ్చే రైళ్లు మాత్రమే కాదు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే కాచిగూడ, నాందేడ్, విశాఖ, గోదావరి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు కూడా గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. ఆధునికీకరణ పనుల కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే.. వందే భారత్ రైళ్లు ఎందుకు ఆలస్యం కావడం లేదని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్యకాలంలో గోదావరి ఎక్స్‌ప్రెస్ రెండు రోజులు ఆలస్యమైంది. ఒకరోజు స్టేషన్‌లో రైలు ఇంజిన్ మార్చే క్రమంలో వైర్లు తెగిపోవడం, మరో రోజు గూడ్స్ రైలులో సమస్య తలెత్తడం వల్ల విశాఖకు ఆలస్యంగా చేరుకున్నట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించడం వల్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. దీని వల్ల ముఖ్యమైన పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పనుల మీద రైలు ప్రయాణాలు చేసే వారు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు రైలు ఆలస్యం వల్ల ప్రయాణికులు ప్లానింగ్ మొత్తం మారిపోతోంది. దీని వల్ల అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోంది. అలాగే కనెక్టింగ్ రైళ్లనూ అందులేకపోవతున్నారు. ఒక రైలు ఆలస్యం అయితే దానిపై ఆధారపడి ఉండే ఇతర రైళ్లు లేదా బస్సులు తప్పిపోతున్నాయని ప్రయాణికులు అంటున్నారు.

ఇబ్బందులు పడ్డాం

ఇటీవల హైదరాబాద్ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ వచ్చాను. ఈ రైలు ఉదయం 6 గంటలలోపు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉండగా.. ఆ రోజు ఆలస్యంగా ఉదయం 7.30 గంటలకు చేరుకుంది. స్టేషన్‌కు దగ్గరలోనే చాలా సేపు నిలిపివేశారు. దీంతో చాలా ఇబ్బందులు పడ్డాం.

– పి.సునీల్‌కుమార్, విశాఖపట్నం


రైళ్లన్నీ ఆలస్యంగానే..

సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ చేయించుకున్నాను. కానీ ఈ రైలు విశాఖకు 7.40 గంటలకు చేరుకోవాల్సి ఉండగా.. సుమారు 9 గంటలకు విశాఖపట్నం వచ్చింది. దీని తర్వాత వెళ్లాల్సిన రైళ్లన్నీ పంపించిన తర్వాత ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరింది.

– ఎస్.మోహన్, విశాఖపట్నం

స్పెషల్ ఫోకస్

- స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళనకు పోలీస్ కమిషనర్ చర్యలు
- త్వరలో కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు బదిలీలు?
- ఇకపై మూడు రోజుల్లో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్
- ఏడు రోజుల్లో ఉద్యోగ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు జారీ



విశాఖ సిటీ : పోలీస్ స్పెషల్ బ్రాంచ్‌పై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక దృష్టి సారించారు. దీర్ఘకాలంగా తిష్టవేసిన వారిపై బదిలీ వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా కొంత మంది సిబ్బందిపై ఫిర్యాదులు, ఆరోపణలు వెల్లువెత్తడంతో స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొంత మందికి స్థానచలనం కలిగించారు. త్వరలోనే అందరిపై బదిలీ వేటు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

అనేక ఆరోపణలు

స్పెషల్ బ్రాంచ్‌లో కొంత మంది అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై సీపీ ఇప్పటికే కొంత మందిపై రహస్యంగా విచారణ చేయిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆ ఆరోపణలు వెల్లడైతే వారిపై చర్యలు తీసుకోనున్నారు. ప్రధానంగా పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విషయంలో సిబ్బందిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్న వారి వెరిఫికేషన్‌కు వచ్చే సిబ్బంది రూ.2 వేలకు పైగా వసూలు చేస్తుండడం బహిరంగ రహస్యమే. అయినప్పటికీ రోజుల తరబడి వెరిఫికేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌కు కూడా 30 నుంచి 50 రోజులు కమిషనరేట్ చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయాలపై దృష్టి పెట్టిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఇప్పటికే సిబ్బందిపై సీరియస్ అయినట్లు తెలిసింది.

పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ వేగవంతం

రోజులు, నెలలు పట్టే పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం ఇకపై కేవలం మూడు రోజుల్లోనే పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేయనున్నారు. తద్వారా పాస్టుపోర్ట్ కూడా త్వరగానే మంజూరయ్యే అవకాశముంది. అలాగే వివిధ కంపెనీలు, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల కోసం అవసరమయ్యే వెరిఫికేషన్ సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను కేవలం వారం రోజుల్లో అందించనున్నారు. నిర్దేశిత కాల వ్యవధిలో ఈ సేవలు అందకుంటే 7995095799 నెంబర్‌కు సమాచారం అందించాలని సీపీ సూచించారు.

హనీ ట్రాప్ కేసులో మరో ముగ్గురి అరెస్ట్

- బడాబాబులే టార్గెట్‌గా వలపు వల విసిరిన జాయ్ జమీమా
- ఇప్పటికే ఆమెతో పాటు మరో ముగ్గురు అరెస్ట్
- తాజాగా కీలక ముఠా సభ్యులు రిమాండ్‌కు తరలింపు
- ఇందులో బీజేపీ యువ నాయకుడు అవినాష్ బెంజమిన్ కూడా..


జాయ్ జమీమాతో బెంజమిన్(ఫైల్)

విశాఖ సిటీ: హనీట్రాప్ కేసులో పోలీసులు వేగం పెంచారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా మరో ముగ్గురు కీలక ముఠా సభ్యులను కటకటాల్లోకి పంపించారు. ఇందులో బీజేపీకి చెందిన యువ నాయకుడు కూడా ఉన్నాడు. బడాబాబులే టార్గెట్‌గా చేసుకుని వలపు వల విసిరి.. అనేక మంది నుంచి రూ.లక్షల్లో డబ్బు దోచుకున్న జాయ్ జమీమాతో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఐదేళ్ల నుంచి సమాజంలో ఉన్నతమైన కుటుంబాలను టార్గెట్ చేసిన ఈ ముఠాలో అటవీశాఖ అధికారి బుచ్చ వేణుభాస్కర రావు, కిశోర్ వేముల ఇప్పటికే విశాఖ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠాలో మరో ముగ్గురు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న కీలక సూత్రధారులు ఫాతిమా ఉస్మాన్ చౌదరి@జోయా, ఆమె భర్త తన్వీర్‌తో పాటు బీజేపీ నాయకుడు అవినాష్ బెంజమిన్‌ను అరెస్ట్ చేశారు.

చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

జాయ్ జమీమాను విచారించిన సమయంలో తనను ఏమీ చేయలేరని, రాజకీయ నాయకుల అండ ఉందని పోలీసులను హెచ్చరించింది. విచారణకు సహకరించలేదు. దీంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఇందులో బీజేపీకి చెందిన యువ నాయకుడు అవినాష్ బెంజమిన్‌తో పాటు దంపతులు ఫాతిమా ఉస్మాన్ చౌదరి@జోయా, తన్వీర్ పాత్ర కూడా ఉన్నట్లు తెలుసుకున్నారు. బాధితుల మీద ఉపయోగించిన మత్తు పదార్థాలు, స్ప్రేల సరఫరాలో వీరు కీలక పాత్ర పోషించినట్లు నిర్ధారణకు వచ్చారు. వారి మధ్య భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు సేకరించారు. వీరి కోసం నిఘా పెట్టగా.. హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. కంచరపాలెం పోలీసులు అక్కడకు వెళ్లి నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. రిమాండ్ బదిలీ ప్రక్రియ ద్వారా వారిని విశాఖకు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించింది.

ఒక్కరి ఫిర్యాదుతో బయటకొచ్చిన బాధితులు

జాయ్ జమీమా అనేక మంది బడాబాబులకు వలపు వల విసిరింది. వారిని బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షలు కాజేసింది. మరికొంత మందితో సహజీవనం చేసి.. వారి భార్యలకు విడాకులు ఇచ్చి తనని పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసేంది. అందుకు అంగీకరించని పక్షంలో హత్యాప్రయత్నం చేసి భారీగా నగదు దోచుకుంది. ఆమె ట్రాప్‌లో చిక్కుకున్న ఒక ఎన్ఆర్ఐ కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు. కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఈ కేసులో జాయ్ జమీమా వెనుక ముఠా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో లభించిన సమాచారంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అటవీ శాఖ అధికారి వేణు భాస్కర్‌రెడ్డిని, మరో సభ్యుడు కిశోర్ వేములను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వీరు ముగ్గురు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. భీమిలి కేసుకు సంబంధించి ఆమెకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా.. మిగిలిన స్టేషన్లలో నమోదైన కేసులపై కూడా ఆమె బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంది.

వీరి చేతిలో మరికొంత మంది మోసపోయినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ముందుకు వస్తే వారికి న్యాయం జరిగేలా చూస్తామని చెబుతున్నారు.

పెదబొడ్డేపల్లిలో భారీ చోరీ


బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ మోహన్, సీఐ రేవతమ్మ

నర్సీపట్నం: స్థానిక పెదబొడ్డేపల్లిలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. హెల్త్ అసిస్టెంట్ బి.జె.వి.ప్రసాద్ ఇంట్లో రూ.8 లక్షల నగదు, సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ప్రసాద్ పెదబొడ్డేపల్లిలో నివాసం ఉంటున్నారు. క్రిస్మస్ కారణంగా తన స్వగ్రామం కాకినాడ జిల్లా తునికి మంగళవారం రాత్రి వెళ్లారు. దీనిని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ప్రధాన తలుపు తాళం విరగొట్టి లోపలికి ప్రవేశించారు. రెండు బీరువాల్లో రూ.8 లక్షల నగదు, సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలను పట్టుకెళ్లిపోయారు. ఆ ఇంట్లో పనిచేసే వ్యక్తి బుధవారం మధ్యాహ్నం వచ్చి చూడగా తలుపు తీసి ఉండటాన్ని గమనించి ప్రసాద్‌కు ఫోన్ చేశారు. వెంటనే ఆయన టౌన్ పోలీసులను సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ మోహన్, సీఐ ఎల్.రేవతమ్మ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాజ్‌పేయి హయాంలోనే దేశాభివృద్ధికి బలమైన పునాదులు

- గవర్నర్ కంభంపాటి హరిబాబు


మాట్లాడుతున్న ఒడిశా నూతన గవర్నర్ హరిబాబు

బీచ్‌రోడ్డు: దేశంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి.. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి కృషి ఎంతో ఉందని ఒడిశా నూతన గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ దేశంలోని నాలుగు మెట్రో నగరాలైన ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నైలను కలుపుతూ స్వర్ణ చతుర్భుజి పేరిట నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణ.. దేశ పురోగతిలో ఒక మైలురాయిగా నిలిచిందని కొనియాడారు. టెలీ కమ్యూనికేషన్, రవాణా, బ్యాంకింగ్, ఇంధన వనరులు, విద్య, రక్షణ, వ్యవసాయం, విద్యుత్ మొదలైన రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వాజ్‌పేయి హయాంలో బలమైన పునాదులు పడ్డాయని గుర్తు చేశారు. దీంతో నేడు దేశం సర్వతోముఖాభివృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా దేశం పరుగులు పెడుతున్న వేళ.. నాటి దార్శనిక ప్రధాని వాజ్‌పేయికి దేశం రుణపడి ఉంటుందన్నారు. ఆయన హయాంలోనే పోఖ్రాన్ అణు పరీక్షలు విజయవంతంగా నిర్వహించి, దేశాన్ని అణుశక్తి గల దేశంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. కార్గిల్ దురాక్రమణకు దిగిన పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో వాజ్‌పేయి చూపిన చాణక్యాన్ని వివరించారు. 1999లో 81 మంది మంత్రులతో 24 పార్టీల సంకీర్ణ ప్రభుత్వాన్ని ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా నడిపిన ఘన చరిత్ర ఆయన సొంతమన్నారు. పేద వృద్ధుల కోసం అంత్యోదయ అన్న యోజన పథకాన్ని ప్రవేశపెట్టి వారికి ఉచితంగా బియ్యాన్ని అందించారన్నారు. పార్లమెంటులో చాకచక్యంగా వ్యవహరించి ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలను ఎటువంటి వివాదాలకు తావు లేకుండా విభజించడం ఆయనకే సాధ్యమైందని కొనియాడారు. ప్రస్తుత ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకెళ్తోందని హరిబాబు అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు కాశీవిశ్వనాథ్ రాజు, ఓబీసీ మోర్చా ప్రత్యేక ఆహ్వానితురాలు కూరాడ పావని, వీరబాహు దినోత్సవ జోనల్ కార్యదర్శి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి తదితరులు వాజ్‌పేయికి ఘన నివాళులర్పించారు.

ఫెన్సింగ్ పోటీలకు జట్ల ఎంపిక రేపు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్వీ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. హౌజత్ స్పోర్ట్స్ క్లబ్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి అండర్–17 బాలబాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఇందుకు 2008 జనవరి 1 నుంచి 2024 డిసెంబర్ 27 మధ్య జన్మించిన వారు అర్హులు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్‌మెంట్‌తో సమయానికి హాజరు కావాలని ఆయన సూచించారు. ఎంపికైన జట్లు కాకినాడ ఏడీబీ రోడ్డులోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే 10వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 94900 73414లో సంప్రదించవచ్చు.

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

- ఈ ఏడాది 1.5 లక్షల టన్నులు లక్ష్యం
- టన్ను చెరకుకు రూ.3,151 మద్దతు ధర
- ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు వెల్లడి


గోవాడ సుగర్స్‌లో కేన్ క్యారీయర్ వద్ద పూజలు చేసి, చెరకు గెడలు వేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. ఫ్యాక్టరీ కేన్ క్యారీయర్ వద్ద మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు, అధికారులు, కార్మికులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కేన్ క్యారీయర్‌లో చెరకు గెడల కట్టలు వేసి క్యారీయర్‌ను ఆన్ చేసి ఈ సీజన్‌కు సంబంధించిన క్రషింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ సన్యాసినాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని సమస్యలు అధిగమించి అనుకున్న లక్ష్యం మేరకు క్రషింగ్ చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. వారంరోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ చేపడతామని చెప్పారు. ఈ ఏడాది 9.5శాతం రికవరీ వస్తే టన్నుకి రూ. 3,151 చొప్పున చెల్లించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సీజన్‌లో సుమారు 1.5 లక్షల టన్నులచెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న మొత్తం చెరకును తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికి 13వేల మంది రైతుల నుంచి 1.50 లక్షల టన్నుల చెరకు సేకరించేందుకు అగ్రిమెంట్లు పొందినట్టు చెప్పారు. కటింగ్ పర్మిట్లు ఇచ్చిన 48గంటల్లోగా ఫ్యాక్టరీకి సరఫరా చేయాలని రైతులను ఎండీ కోరారు. రస నాణ్యతను బట్టి కటింగ్ ఆర్డర్లు ఇస్తామన్నారు. ఒకే చోట రైతులు గ్రూపుగా ఉండి చెరకు వేస్తే వారందరికీ ఒకే సారి కటింగ్ పర్మిట్లు ఇచ్చే విధానాన్ని కూడా అమలులోకి తెచ్చినట్టు తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రైతులకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఒంటి కన్ను ముచ్చు విత్తనం ఇవ్వడంతోపాటు మంచి రికవరీ వచ్చే విత్తనాలను ఈ ఏడాది రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గత సీజన్‌కు సంబంధించి టన్నుకి రూ.350 చొప్పున రైతులకు చెల్లించాల్సి ఉందని, ఈ బకాయిలు త్వరలో చెల్లిస్తామని ఎండీ చెప్పారు. ఈ ఏడాది సరఫరా చేసే చెరకుకు సకాలంలోనే డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. రైతులంతా చెరకు సరఫరా చేసి ఫ్యాక్టరీ మనుగడను కాపాడాలని, ప్రైవేటు ఫ్యాక్టరీలకు ఎవరూ సరఫరా చేయవద్దని ఆయన కోరారు.

ఎస్టీపీఐ ఇంక్యుబేషన్ సెంటర్‌కు భూమిపూజ

- 2023లో ఏయూతో ఒప్పందం చేసుకున్న ఎస్టీపీఐ


భూమిపూజ చేస్తున్న ఎస్టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్టీపీఐ) డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో రూ.19.17 కోట్లతో నిర్మిస్తున్న ఇంక్యుబేషన్ సెంటర్‌కు బుధవారం భూమి పూజ నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023 జూలైలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు ఏయూతో ఎస్టీపీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. 15 నెలల్లో 30 వేల చదరపు అడుగుల సామర్థ్యంతో ఇంక్యుబేషన్ సెంటర్ అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఎస్టీపీఐ డీజీ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ ఐటీ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు విశాఖ వంటి నగరాలే మొదటి ప్రాధాన్యమన్నారు. ఇందులో భాగంగానే విశాఖలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే ఎస్టీపీఐ 20 సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీవోఈ)లను విశాఖ సహా దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిందని తెలిపారు. పరిశోధనలు, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు అన్ని విధాలా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందుకోసం కల్పతరు ప్రారంభించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్టీపీఐ విశాఖ ప్రతినిధి జార్జ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

- వేర్వేరు కేసుల్లో 23 కిలోల గంజాయి స్వాధీనం


రైల్వేస్టేషన్‌లో చిక్కిన గంజాయి నిందితుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను విశాఖ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి తమ సిబ్బందితో కలిసి పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన కిరణ్ కిల్లో ముంబైకు గంజాయి రవాణా చేస్తుండటాన్ని గుర్తించారు. అతని నుంచి రూ.75 వేల విలువైన 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మరో కేసులో 8 కేజీల గంజాయి సీజ్.

మంగళవారం జరిగిన తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒ.మిస్త్రీ తమ సిబ్బందితో కలిసి జరిపిన తనిఖీల్లో హర్యానాకు చెందిన రేషంసింగ్ నుంచి రూ.40 వేల విలువైన 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ముగిసిన స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్స్


కోర్స్ పూర్తి చేసిన క్యాడెట్లు

సింథియా: స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్సును నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విజయవంతంగా పూర్తి చేశారు. ఐఎన్ఎస్ సర్కార్ వద్ద గల నావల్ మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు క్యాడెట్లకు స్కూబా డైవింగ్ అడ్వెంచర్ కోర్సులో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో 89 మంది బాలురు, 32 మంది బాలికలు కలిపి మొత్తం 121 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాడెట్‌లకు స్నోర్కెల్లింగ్, స్కూబా డైవింగ్‌లలో ప్రయోగాత్మక శిక్షణను అందిస్తూనే.. వారిలో సాహసం, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ఈ కోర్సును నిర్వహించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. ముగింపు వేడుకలో కమోడోర్ హ్యాపీ మోహన్(ఐఎన్ఎస్ సర్కార్ కమాండింగ్ ఆఫీసర్) ముఖ్య అతిథిగా హాజరై క్యాడెట్‌లను అభినందించారు. యువతలో ఆత్మవిశ్వాసం, సమష్టి కృషి, నాయకత్వ నైపుణ్యాలు, దేశ నిర్మాణాన్ని పెంపొందించడంలో ఇటువంటి కోర్సులు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు.